# చచ్చినా చావకు!

గుమ్మడి వెంకటేశ్వరరావుగారు మహా నటుడు. యువకుడుగా వుండగానే పెద్ద వేషాలు వేసి, ఇటు సౌమ్యంగానూ అటు విలన్‌గానూ ఒకేసారి ఒప్పించిన గొప్ప నటుడు. మంచి హాస్యనటుడే కాక, ఆయన స్వతహాగా హాస్యపరులు కూడాను. ఆయన చెప్పిన ఒక జోకుతో ఈ వ్యాసం మొదలుపెడతాను.

మన తెలుగు సినిమాల్లో వున్న ఒక దౌర్భాగ్యం ఏమిటంటే, ఒక నటుడు ఒక రకమైన పాత్రలో నటిస్తే, అతనికిక అలాటి పాత్రలే ఇస్తారు. నటించటం చేతయిన వాళ్ళకి రకరకాల పాత్రలు ఇచ్చి వారి నటనా కౌశల్యాన్ని వెలికితీసే ఆ రోజుల్లోనే అప్పుడప్పుడూ అలా జరుగుతూ వుండేది. నేను నటన కరువైన ఈరోజుల నటులు గురించి చెప్పటంలేదు. వీళ్ళకి ఏదైనా ఒకటే.

ఆ రోజుల్లో గుమ్మడిగారు తండ్రి పాత్రలో ప్రేక్షకులని మెప్పించేవారు. ఒక సీజన్‌లో అయితే, దాదాపు ప్రతి పాత్రలోనూ ఇంటర్వెల్ కాగానే ఆయన గుండె చేత్తో పట్టుకోవటం. మొదటి ఒకటి రెండు సినిమాల్లో అది చూసి ప్రేక్షకులు కంట తడి పెట్టేవారు. తర్వాత ఏ సినిమాలో చూసినా అదే సీను అవటంతో వాళ్ళకి పెద్ద బాధ వేసేది కాదు. ఇంకా కొన్ని సినిమాలు అలాటివే చూశాక, ఆయన అలా గుండె పట్టుకోగానే ప్రేక్షకులకి నవ్వు వచ్చేదిట. గుమ్మడిగారు అది భరించలేకపోయారు. ఎంతో గొప్పగా చచ్చిపోతుంటే, వీళ్ళు నవ్వుతారేమిటా అని. అప్పుడాయన తన నిర్మాతల దగ్గరికి వెళ్ళి ఇలా అన్నారుట.

'అయ్యా! నేనీ మధ్య ప్రతి సినిమాలోనూ చచ్చిన చావు చావకుండా చస్తున్నాను. నేనా చావులు చావలేను. ఇక చచ్చినా చావను. నన్ను చంపకండి' అని.

0 0 0

'ఏమిటయ్యా ఈ వ్యాసానికి పెట్టిన పేరూ, ముందుగా వ్రాసిన ఉపోద్ఘాతం అంతా చావుల మయం' అనుకుంటున్న వాళ్ళకి ఇదంతా ఎందుకు వ్రాస్తున్నానో

చెప్పవలసిన బాధ్యత వుంది.

నిన్న రాత్రి పేపర్లో వార్తలు చదువుతుంటే ఒక వార్త నన్ను ఆకర్షించింది. అది కొంచెం హాస్యాస్పదంగా వున్నా, నిజం కనుక నిజంగానే నవ్వు తెప్పించింది. ఈ విషయం మీద కబుర్లు నేను వ్రాయవలసిన లిస్టులో లేకపోయినా, అవి పక్కన పెట్టి వెంటనే ఈ వ్యాసం వ్రాస్తున్నాను. మీకూ చదవటానికి సరదాగా వుంటుందని.

బ్రెజిల్ దేశంలో 'బిరితిబా మిరిం' అనే ఒక వూరుంది. అక్కడ జనాభా 28,000. సావ్ పాలో అనే ఒక పెద్ద పట్టణానికి 45 మైళ్ళ దూరం. అది మనవేపు కోనసీమలా బంగారం పండే నేల. వ్యవసాయానికి ప్రసిద్ధి చెందిన ప్రదేశం. పళ్ళూ కూరగాయలే కాకుండా, చేపల పరిశ్రమ వుందక్కడ. దేశంలో అవసరమైన జలచర ఆహార పదార్థాలు తొంభై శాతం అక్కడినించే వస్తాయి. దాదాపు రెండు మిలియన్ల జనాభాకి నీళ్ళ సరఫరా కూడా అక్కడినించే జరుగుతుంది.

అయితే ఏమిటి? అలాటి వూళ్ళు చాల వున్నాయి కదా ప్రపంచంలో. ఎందుకు ఆ వూరి కథ చెబుతున్నావ్?

వస్తున్నాను, వస్తున్నాను. ఇక్కడో కనీ వినీ ఎరుగని ఒక విశేషం వుంది కనుకనే ఈ ఉపోద్ఘాతం.

మొన్నీమధ్యనే ఊరి మేయర్‌గారు ఒక ప్రతిపాదన పెట్టాడు.

అదేమిటంటే ఆ వూళ్ళో ఎవరూ చావటానికి వీల్లేదని! ఎవరైనా ఆ మాటని ధిక్కరించి చనిపోతే, వాళ్ళని శిక్షించటానికి నగర ప్రభుత్వం సిద్ధంగా వుందని!

ఎవరికీ చచ్చిపోవాలని వుండదు తండ్రీ. కానీ పుట్టిన వాళ్ళు చచ్చిపోవటం తప్పదనేది జగమెరిగిన మందపాటి సత్యం. అంటే యమధర్మరాజుగారు (బ్రెజిల్లో - ఆయన్ని పోర్చుగీసు బుడతరాజు అంటారేమో) దున్నపోతు మీద వచ్చినప్పుడు, ప్రభుత్వం వారు జారీ చేసిన గవర్నమెంట్ ఆర్డర్ చూపించి, యముడూ పప్పులో కాలేశావ్ నాయనా... రాంగ్ ప్లేస్ ఎట్ రాంగ్ టైం. వెనక్కి పో అని చెబుతారేమో.

గవర్నమెంట్ వారి జి.ఒ. చూసీ చూడనట్టుగా ప్రభుత్వోల్లంఖన జరిగెనుబో, తదుపరి? పైన చెప్పాం కదా. ఉల్లంఖించినవారు శిక్షింపబడుదురు అని. కనుక న్యాయస్థానానికి వెళ్ళినా, శిక్ష తప్పదు.

కానీ శిక్ష ఎవరికి? పోయిన వాళ్ళా, ఇక్కడ వుండకుండా పోయారు. ఇక శిక్ష ఎలా వేస్తారు. ఆత్మ లేని శరీరం జైల్లో కుళ్ళిపోతుంది. ఆత్మకి శిక్ష వేయటానికి, అది ఇక్కడ లేదు. ఉన్నా దానికి రంగూ రూపం లేవు. ఎం.డి.రాజుగారా ఈ భూతల వాసి కాదు శిక్ష వేయటానికి. ఆయన భూతాల వాసి. మరి ఎవరికి శిక్ష.

ఇదే ప్రశ్న మేయర్‌గారిని అడిగారు.

దానికి ఆయన చక్కటి సమాధానం ఇచ్చాడు. ఆయన అమలు పరచబోయే రూల్ కూడా ప్రభుత్వపరంగా చాల స్పష్టంగా వుంది.

'ప్రజలారా! మీరందరూ ఆరోగ్యంతో వెయ్యేళ్ళు బ్రతకండి. అలా బ్రతకకుండా చచ్చారా, చచ్చారే! ఎందుకంటే మీ శవాల్ని పాతిపెట్టటానికి మన నగరంలో చోటు లేదు' అని.

ఆ ఊరి శ్మశానంలో 3,500 మందిని మాత్రమే పాతిపెట్టటానికి చోటు వుంది. అదీ 1910లో కేటాయించిన స్థలం. తర్వాత ఇప్పటిదాకా 50,000 మందిని అక్కడ పాతిపెట్టారు, చనిపోయిన తర్వాత.

ఇప్పటికే ఒక్కొక్క శవ పేటికలో ఇద్దర్నీ ముగ్గుర్నీ సర్దుతున్నారు. ఇక చోటు లేదు. నో వేకెన్సీ.

పోనీ అలాటివే ఇంకో రెండో మూడో కట్టొచ్చు కదా. కట్టకూడదు. రెండు కారణాల వల్ల కట్టటానికి వీల్లేదు.

ఒకటి అది అసలే బంగారు నేల. దాన్ని ఇలా 'వృధా' చేయటం, దేశాభివృద్ధి దృష్ట్యా కుదరదు.

రెండవది నేషనల్ ఎన్విరాన్‌మెంట్ కౌన్సిల్ వారు, ఆ ప్రదేశం కాలుష్యం అయిపోతుందని అలాటి వాటి మీద పెద్ద ఆంక్ష పెట్టారు. ఈ రెండు ఆంక్షలూ, మన ఎంటీవోడి భాషలో, కేంద్రం పన్నిన కుట్ర.

ఇటు నగర ప్రభుత్వం వారిని చంపుతూ, చచ్చిపోయిన వాళ్ళని పోనీయక, కేంద్ర ప్రభుత్వం చేస్తున్న తీరుకి చచ్చేంత కోపంతో మండి పడి, మేయర్‌గారు తీసుకున్న నిర్ణయం ఇది.

మేయర్‌గారి ఆఫీసు ప్రతినిధి చెప్పినదిది. 'మాకు తెలుసు మేం తీసుకున్న నిర్ణయం హాస్యాస్పదమని. అంతేకాదు దీన్ని ఒక లెజిస్లేషన్‌గా చేయటం కూడా అంత తేలిక కాదు. అందుకే చనిపోయిన వారికి ఇదీ శిక్ష అని కానీ, ఇదీ ఫైన్ అని కానీ నిర్ణయించలేదు. కేవలం కేంద్ర ప్రభుత్వం కళ్ళు తెరిపించటానికి చేస్తున్న ప్రయోగం ఇది' అన్నాడు.

మేయర్‌గారు అంటాడు 'ఇంకో ఆరు నెలలు పోతే ఈ సమస్య ఇంకా పెద్దదవుతుంది. ఇటు చూస్తే నుయ్యి. అటు చూస్తే గొయ్యి. మరి మేం ఏం చేయాలి? ఎలా చావాలి? చుట్టు పక్కల అరవై మైళ్ళ లోపు వున్న 20 వూళ్ళల్లో కూడా ఇదే సమస్య. ప్రభుత్వాలూ, న్యాయ స్థానాలూ, విననప్పుడు మిగిలిందిదొక్కటే'

మన నేల మీద నడిచే మన మానవులే విననప్పుడు, గాల్లో దున్నపోతు మీద వెళ్ళే యమధర్మరాజు వింటాడా?

ఆ దేశంలోనే, కొన్నేళ్ళ క్రితం జనాభా తక్కువగా వున్నదని కాండోమ్స్ (నిరోధ్‌లు) వాడటం బహిష్కరించారు. షాపులవాళ్ళు వాళ్ళ లాభాలు తగ్గిపోతాయని, అవి దొంగచాటుగా అమ్మారుట.

మరి ఈ విషయంలో అలా దొంగ చాటుగా చేయటానికి వీల్లేదు. ప్రభుత్వ పరంగా జరగాల్సిందే

అందుకే ఈ సమస్యని ఎలా సాధించాలా అని వాళ్ళు తన్నుకు చావటం!

0 0 0